క్లుప్తంగా

బాబా అనుగ్రహం అందరిపై ఉండాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న సభ్యులు

వి.కోట: సత్యసాయిబాబా దివ్య అనుగ్రహం, ఆశీస్సులు మనందరిపై ఉండాలని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ కోరారు. ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలో వేదపఠనం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. సత్యసాయిబాబా సంస్థ కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా సమన్వయకర్త యశోద, బాలవికాస్ సమన్వయకర్త వసంత, వేదం ఇన్‌చార్జ్ సావిత్రి, అమరనాథ్, కుసుమ, హరి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కాలువలో జేసీబీతో పూడిక తీత

వి.కోట: విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మేజర్ పంచాయతీ ఈఓ యాదవపతి సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగుకాలువలు శుభ్రపరచడంతోపాటు, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. పలమనేరు రోడ్డులో ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి జేసీబీ సాయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈఓ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య పనులు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేసుకున్న రోగులు

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వీరిలో 62 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స కోసం బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. సాయి మాత సేవా ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్ బాబు, కంటి వైద్యులు శివ, లావణ్య, నేత్ర, మటార్లపల్లి వీరభద్ర పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణ సర్వే వేగవంతం

తవణంపల్లె: కుష్టువ్యాధి నివారణపై జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని డీపీఎంఓ మణి సూచించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న లెప్రసీ సర్వేను జోగివారిపల్లెలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం గురించి వివరించారు. కుష్టువ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. ఆగస్టు 2లోపు సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఏఎన్‌ఎం తులసి, ఆశా కార్యకర్త అశ్విని, అంగన్‌వాడీ కార్యకర్త వినాయకం పాల్గొన్నారు.

29న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 29న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 28వ తేదీ మధ్యాహ్నం నుంచి రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అలాగే పలుసాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు ఆదివారం ఓ దాత నగదు విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బాలాజీ విరాళాన్ని రూ.1,01,116 చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి దర్శనభాగ్యం కల్పించారు. ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది వాసు, విఘ్నేష్ ఉన్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

- అటకెక్కిన నిషేధం
- పట్టించుకోని అధికారులు

పెద్దపంజాణి: ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినా వాటి వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం నిత్యావసరంగా మారింది. మండలంలోని 25 పంచాయతీలలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువ కావడంతో కాలుష్యం పెరిగిపోయింది. మనుషులు, జంతువులు నివాసం ఉండే ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు మట్టిలో కలిసిపోయేందుకు ఎన్నో సంవత్సరాలు పడుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కేన్సర్ ముప్పు ఉందని వైద్యులు చెప్పినా ప్రజలు వినియోగిస్తూనే ఉన్నారు. నిషేధం దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఏ వస్తువు విక్రయించినా ప్లాస్టిక్ కవర్లలోనే ఇంటికి తీసుకురావడం అలవాటుగా మారింది. ప్రత్యామ్నాయాల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పల్లెల్లో పెరుగుతున్న వాడకం..

పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం కనుమరుగవడంతో పాటు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. గతంలో పల్లెల్లో విందు భోజనాలకు విస్తరాకులు, అరిటాకులు మాత్రమే వినియోగించే వారు. ప్రస్తుతం ప్లాస్టిక్ ప్లేట్లతో భోజనం చేయడం, ప్లాస్టిక్ గ్లాసులతో నీళ్లు తాగడం అలవాటుగా మారిపోయింది. వీటితో పాటు ఆహార పొట్లాలు, చల్లని పానీయాలు, సాంబారు, బిర్యానీ పార్సిళ్లకు ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. చివరకు ఇడ్లీ పాత్రల్లో సైతం ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి.



మండల కేంద్రంలో వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మృత్యువాత పడుతున్న జంతువులు..

ప్లాస్టిక్ కవర్లు వాడేసిన తరువాత వాటిని ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో వాటిని జంతువులు ఆహారంగా తీసుకుంటున్నాయి. ప్లాస్టిక్ జీర్ణమయ్యే పరిస్థితి లేకపోవడంతో జీర్ణాశయంలో పేరుకుపోయి మూగజీవాలు మరణిస్తున్నాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు..

వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపొరల్లో పేరుకుపోతున్నాయి. ఫలితంగా భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కరగకుండా కొన్ని సంవత్సరాలు అలాగే ఉండిపోవడంతో పంటలకు కూడా ముప్పు వాటిల్లుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

అమ్మకాలపై నియంత్రణ కరువు..

నలభై మైక్రాన్ల సామర్థ్యం కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచుల వాడకంపై నిషేధం ఉన్నా, నిబంధనలు ఉల్లంఘించి అమ్మకాలు జరిపే దుకాణాలపై దాడులు జరిపి కేసులు నమోదు చేయాలని గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదట్లో తూతూమంత్రంగా దాడులు చేసినా అధికారులు తర్వాత పూర్తిగా నిషేధాన్ని పట్టించుకోకుండా పక్కన పెట్టేశారు. దీంతో ఇప్పటికీ పలు దుకాణాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్ అమ్మకాలు కొనసాగుతున్నాయి.

> **ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించాలి..**
>
> 
>
> మొదట ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాలి. ప్లాస్టిక్ సంచులకు బదులుగా నార సంచులు, కాగితంతో తయారు చేసిన సంచులను వాడే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలి. నిషేధం పక్కాగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. –టి.మురళి, పెద్దపంజాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి

నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణారెడ్డి

సదుం: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సీఐ కృష్ణారెడ్డి సూచించారు. మండలంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు, రికార్డులు సక్రమంగా లేని, నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేశారు. జరిమానా విధించారు. రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిల చెల్లింపు, 12వ వేతన సవరణకు సంబంధించిన మధ్యంతర భృతి, కరువు భత్యం బకాయిలకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగుల ఆశలను వమ్ము చేయకుండా న్యాయం చేయాలని కోరారు.

శ్రీవారి సేవకుల అద్భుత అలంకరణ




కాణిపాకం ఆలయంలో కూరగాయలతో చేసిన అలంకరణలు




కూరగాయలతో కాణిపాకం ఆలయ అలంకరణ చేసిన శ్రీవారి సేవకులు, దొండకాయ వినాయకుడు

- కాణిపాకం ఆలయంలో కూరగాయలతో అలంకరణ

పలమనేరు: కాణిపాకం ఆలయంలో ఆషాడ పౌర్ణమి సందర్భంగా కూరగాయల అలంకరణ కోసం స్థానిక శ్రీవారి భక్తులు 15 టన్నుల కూరగాయలను వితరణగా పంపి ఆలయంలో వారే స్వయంగా కూరగాయలతో స్వామివార్లకు, ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా అక్కడి మరగధాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయాల్లో శాకంబరి అలంకరణ చేశారు. ఏటా ఇక్కడి ఆలయంలో పట్టణానికి చెందిన శ్రీవారి భక్తులు కూరగాయలతో ఆలయాన్ని అలంకరిస్తుంటారు. ఈ అలంకరణకు సంబంధించి దాతల సాయంతో రూ.3.70లక్షల విలువజేసే కూరగాయలను సేకరించి కాణిపాకం ఆలయంలో అలంకరించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. వీరిని ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో స్థానిక శ్రీవారి భక్తులు రవీంద్రారెడ్డి, కిశోర్ స్వామి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణశెట్టి పాల్గొన్నారు.

ఆయన సేవలు చిరస్మరణీయం

సదుం: ఎంపీపీగా ఎల్లప్ప చిరస్మరణీయమైన సేవలు అందించారని రిటైర్డ్ ఎంఈఓ రామచంద్రయ్య తెలిపారు. మండలంలోని రామాపురంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎల్లప్ప సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. గుండెపోటుతో ఎల్లప్ప మరణించడం బాధాకరమని చెప్పారు. మండల అభివృద్ధికి విశేషంగా కృషిచేశారని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్లప్ప సతీమణి, మాజీ సర్పంచ్ కృష్ణమ్మ, కృష్ణారెడ్డి, రాజన్న, హనుమంత రెడ్డి, హరినాథరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నాగభూషణం రెడ్డి, డాక్టర్ నారాయణ, రవికుమార్, మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి, సీతాపతి, హరి, సుబ్రమణ్యం, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఘనంగా గురుపౌర్ణమి పూజలు



మాదనపల్లెలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



పలమనేరు: గీత సారాంశాన్ని వింటున్న చిన్నారులు



సదుంలో..

పుంగనూరు: గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ దత్తక్షేత్రం, శ్రీషిరిడీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పట్టణంలోని కొత్తయిండ్లలోని సాయిబాబా ఆలయం, చెరువుకట్టపైన సాయి, దత్త ఆలయం, యాబైరాళ్ల మొరవలోని శ్రీదత్తక్షేత్రం, మాదనపల్లెలోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథున్ని ప్రత్యేకంగా అలంకరించారు. సాయినామ స్మరణతో ఆలయాలు భక్తిపారవశ్యమయ్యాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక దేవాలయాల్లో గురుపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. సాయిబాబా, అర్చకులు వేద మంత్రాలతో పూజలు, అభిషేకాలు చేశారు.

సదుంలో..

సదుం: స్థానిక గాంధీరోడ్డులోని సాయిమందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం కాగడా హారతి, పాలాభిషేకం, సాయి భజన, మధ్యాహ్నం హారతి, ధూప్ హారతి, శేజ్ హారతి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు భజనలు నిర్వహించారు. ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని షిరిడీసాయిబాబా ఆలయంలో భక్తులు 108 ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. బాబాను వెండి సింహాసనంపై పుష్పాలతో అలంకరించారు. సాయిబాబా భక్తుల సంకీర్తనలతో ఆలయం మారుమోగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కుప్పం: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌పీ రోడ్డులోని సాయిబాబా మందిరం, మోడల్ కాలనీ, ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణం ఎదురుగా ఉన్నా సాయిబాబా మందిరాల్లో పౌర్ణమి వేడుకులు ఘనంగా నిర్వహించారు.

వి.కోటలో..

వి.కోట: ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణ సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

శాంతిపురంలో..

శాంతిపురం: కుతేగానిపల్లి సమీపంలోని శ్రీపరమహంస యోగానంద విద్యాలయాలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురోహితుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజలు చేయించారు. శాస్త్రోక్తంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి అన్నప్రసాదాలను అందించారు. ప్రిన్సిపల్ ఆజాద్ హుసేన్, సత్సంగ సొసైటీ సభ్యులు నారాయణ శెట్టి, చంద్రశేఖర్, గణపతిశాస్త్రి, కోదండప్ప పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని బసవన్న ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి, తేజస్వి అనే భగవద్గీత అధ్యాపకులు పిల్లలకు భగవద్గీత కృష్ణుడు బోధించిన గీత సారాంశాన్ని విపులంగా వివరించారు.

కౌండిన్యలో చిరుతల సంచారం

- గతంలో గంకొండ అడవిలో చిరుత మృతి
- రెండేళ్ల క్రితం ఎర్రాంగళ్‌లో కుటుంబీకులపై దాడి
- తాజాగా ఎర్రపెంటలో లేగదూడపై దాడి చేసిన చిరుత
- అడవిలో మృత్యువాత పడుతున్న మూగజీవాలు



గంకొండ అడవిలో మృతిచెందిన చిరుత(ఫైల్),



క్రూరమృగాల చేతిలో మృతిచెందిన మేక (ఫైల్)



కౌండిన్య అడవికి సమీపంలోని మోర్ధనలో సంచరిస్తున్న చిరుత (ఫైల్)

పలమనేరు: ఏనుగులకు నిలయమైన కౌండిన్య అభయారణ్యంలో ఇప్పుడు చిరుతల సంచారం అటవీ ప్రాంత గ్రామాలను ఆందోళన కలిగిస్తోంది. మూడు రోజుల క్రితం పలమనేరు మండలంలోని ఎర్రపెంట అడవి సమీపంలోని ఇంటివద్ద కట్టేసిన దూడపై చిరుత దాడి చేసింది. గతంలో కౌండిన్య అటవి సమీప గ్రామాల్లో రెండు దూడలు, మేక క్రూరమృగాల బారిన పడి మృతిచెందాయి. అయితే మృతిచెందిన దూడలను చంపింది పులులు, చిరుత కాదని కేవలం హైనాలని స్థానిక అటవీశాఖ అధికారులు ఎప్పటినుంచో చెబుతున్న సమాచారం. వీరు చెప్పేది నిజమైతే ఈ ప్రాంతంలో పులుల సంచారం లేకుంటే గతంలో బంగారుపాళెం అడవిలో వేటగాళ్ల ఉచ్చులో పడి ఓ చిరుత బంధింపబడి ఆపై మృతిచెందింది. మూడేళ్ల క్రితం పెద్దపంజాణి మండలంలో మరో చిరుత మృతిచెంది కనిపించింది. రెండేళ్ల క్రితం కౌండిన్య అభయారణ్యానికి పది కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు మోర్ధన ఫారెస్ట్‌లోని ఎర్రాంగళ్‌లోని ఓ ఇంట్లోకి వెళ్లిన చిరుత కుటుంబీకులను గాయపరిచించి. దీనికి అటవీశాఖ సరైన వివరాలను చెప్పడం లేదు. ఏదేమైనా కౌండిన్య అడవికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో చిరుతల సంచారంపై ఆందోళనలు తప్పడం లేదు.

చిరుతల సంతతి పెరిగినట్టే...

కౌండిన్య అభయారణ్యానికి ఆనుకుని పలమనేరు నియోజకవర్గంలోని మండిపేటకోటూరు, చెత్తపెంట, ఊసరపెంట, కాలువపల్లి, తిమ్మయ్యగారిపల్లి, వెంగంవారిపల్లి, తోటకనుమ, కైగల్, గాంధీనగర్, జగమర్లలున్నాయి. బంగారుపాళెం మండలం కీరమంద, టేకుమంద తమిళనాడు రాష్ట్రానికి చెందిన సైనగుంట్ల, అరవట్ల, మోర్ధన, గుండ్లపల్లి, జిట్టిపల్లి, ధనకొండపల్లి, జంగాళపల్లి ఉన్నాయి. ఇక పెద్దపంజాణి, సోమల మండలాల్లోని అడవులు కౌండిన్యకు సమీపంలోనివే. కౌండిన్య అభయారణ్యంలో 93 ఏనుగులు గుంపులుగా సంచరిస్తుంటాయి. వీటితో పాటు హైనాలు, చీటాలున్నట్టు తెలుస్తోంది. గతంలో కడతట్లపల్లి వద్ద ఓ పశువును చిరుత చంపేసిందని పశువుల కాపరి తెలిపాడు. అదేవిధంగా గాంధీనగర్‌లో అడవిలోనూ మేతకెళ్లిన ఓ పాడిఆవు బలైంది. పలమనేరు–గుడియాత్తం అటవీమార్గంలోని సైనిగుంట వద్ద చిరుతను చూశామని ఆ మార్గంలో వెళ్లే పలువురు వాహనదారులు చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ఇప్పటికే రెండు చిరుతలు మృతిచెందగా మరో నాలుగు చిరుతలు కౌండిన్యలో సంచరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇవే కాకుండా పది దాకా హైనా(దుమ్ములగొండి) లున్నట్టు తెలుస్తోంది. రోజుకు 60 కిలోమీటర్ల మేర ఒంటరిగా సంచరిస్తూ వేటాడే చిరుతలు వదిలేసిన జంతువుల కళేబరాలను హైనాలు పీక్కుతింటాయని మేకల కాపరులు చెబుతున్నారు.

అటవీ గ్రామాలకు తప్పని టెన్షన్..

కౌండిన్య అడవిలో చిరుతలు, హైనాలు సంచరిస్తుండడంతో అటవీ సమీపంలోని గ్రామాలకు ఆందోళన తప్పడం లేదు. ముఖ్యంగా పొలాల వద్ద ఇళ్లలో కాపురాలుండేవారు, అడవిలోకి పశువులు, మేకలను తోలుకెళ్లేవారు భయపడుతున్నారు. మూడేళ్లుగా కౌండిన్యలో మేతకెళ్లిన మందల్లోని మేకలు మాయమవుతున్నట్టు కాపరులు చెబుతుండేవారు. కానీ కౌండిన్యలో ఉన్నవి చిరుతలు కాదని హైనాలని అటవీశాఖ చెప్పడం గమనార్హం. కౌండిన్య ఎలిఫెంట్ శాంచురిలో ఏనుగులు తప్ప పులులు, చిరుతలు లేనప్పుడు బలిజపల్లి వద్ద, గంకొండ వద్ద మృతిచెందిన చిరుతలు ఎక్కడి నుంచి వచ్చాయనేది అటవీశాఖకే తెలియాలి.

శాస్త్రోక్తంగా చండీ హోమం



బోయకొండలో నిర్వహిస్తున్న చండీ హోమం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో చండీ హోమాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఆలయ ఉపకమిషనర్ ఏకాంబరం తోపాటు ఉభయదారులచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ చండీహోమ పూజలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు, ఉభయదారులకు అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.

తెలుగుభాష రక్షణకు చర్యలు



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తెలుగు భాష రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు కోరారు. పట్టణ సమీపంలోని కళామందిరంలో ఆదివారం 'తెలుగుభాష నూతన ప్రభుత్వం' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్య నుంచి తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతను కల్పించాలని సూచించారు. పలువురు కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బంగారుపాళెం: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ లక్ష్మయ్య అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు వేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కారులో ప్రయాణించేవారు విధిగా సీట్ బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే లైసెన్సులు రద్దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వాహనదారులు రహదారి నింబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తెలిపారు. ప్రమాదాల బారినపడితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదన్నారు. వాహనాల తనిఖీల్లో ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది అస్గర్, బెనర్జీరావు, ద్వారకనాథ్ పాల్గొన్నారు.